

అష్టదళ పద్మారాధన
డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



ముగిసిన ధారోత్సవాలు
సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సంద్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పండగ పూట పెను విషాదం
ఫ్లెక్సీలు కడుతుండగా విద్యుదా ఘాతానికి గురైన ఇద్దరు యువకులు మృతి చెందారు. 8లో

పోటెత్తిన భక్తజన కొండ

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జనం
- ఘనంగా బౌద్ధ మేళా.. జాతర నిర్వహణ


తుమ్మపాల: తీర్థానికి వచ్చిన జనసందోహంతో బొజ్జన్నకొండపై సంక్రాంతి సందడి కనిపించింది. కనుమ సందర్భంగా మంగళవారం ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండపై తీర్థం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కొండ జనంతో నిండిపోయింది. పిల్లలతో పాటు పెద్దలు కుటుంబ సమేతంగా వచ్చి బౌద్ధ స్తూపాలను దర్శించుకుని కొండపై గల గుహలు, పురాతన విద్యాబోధనశాలను సందర్శించారు. సమీపంలో గల లింగాలకొండపై కూడా జనంతో కిటకిటలాడింది. చుట్టూ పంట పొలాల్లో ఏర్పాటు చేసిన రంగుల రట్నాలు, చిన్నారుల ఆట స్థావరాలు, బొమ్మల దుకాణాలతో సందడి నెలకొంది. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా డీఎస్పీ సుబ్బరాజు, ట్రెయినీ డీఎస్పీ భవ్య రెడ్డి, సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఉదయం బొజ్జన్నకొండపై జరిగిన బౌద్ధమేళాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బౌద్ధ భిక్షువులు పాల్గొన్నారు.

బౌద్ధమార్గం అనుసరణీయం

ప్రపంచ శాంతిని నెలకొల్పే ధర్మమార్గమే బౌద్ధమని, గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బుద్ధుని మార్గాన్ని అనుసరించే స్వాతంత్ర్యాన్ని సాధించి రాజ్యాంగాన్ని రూపొందించారని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. బొజ్జన్నకొండ వద్ద మంగళవారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బౌద్ధమేళాలో ఆమె మాట్లాడారు. ప్రపంచాన్ని శాంతిమార్గంలో నడపాలంటే బుద్ధుని పంచశీల సూత్రాలతోనే సాధ్యమన్నారు. నూతన జిల్లా అనకాపల్లికి కేరాఫ్‌గా బొజ్జన్న కొండను మరింత అభివృద్ధి చేయాలన్న నిశ్చయంతో రూ.1.5 కోట్ల ఎంపీ నిధులతో కొండ నుంచి జాతీయ రహదారి వరకు రెండు కిలోమీటర్ల పొడవు గల రోడ్డును అత్యంత పటిష్టంగా నిర్మించామన్నారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రాష్ట్రంలో బౌద్ధారామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.24 కోట్ల నిధులు వెనక్కి వెళ్లిపోయాయని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి మూలంగానే మరిన్ని నిధులతో రూ.35 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.7.5 కోట్లతో బొజ్జన్నకొండగా రూపురేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. ఏ ప్రాణికి హాని చేయక శాంతి మార్గంలో నడిచే బౌద్ధమతాన్ని అంబేడ్కర్ అనుసరించారని, ఆయన ఆశయ సాధన దిశగా ప్రజాపాలన చేస్తున్న సీఎం జగన్ దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవాడలో ఈ నెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. బౌద్ధ ప్రముఖులు గుణుపూడి బాబులు, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, మాటూరి శ్రీనివాస్ మాట్లాడారు. జిల్లా మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో బౌద్ధ భిక్షువులు వెనరబుల్ డాక్టర్ జ్ఞానదీప్ మహాథేరో, వెనరబుల్ బోధిరత్న మహాదేరో బౌద్ధ పతాకావిష్కరణ చేసి బొజ్జన్నకొండపై గల బౌద్ధస్తూపం వరకు పంచశీల శాంతియాత్ర చేపట్టారు.



కొండపైకి యాత్రగా వెళ్తున్న బౌద్ధ భిక్షువులు, భక్తులు



బొజ్జన్నకొండ తీర్థానికి వచ్చిన జన సందోహం

నేత్రపర్వంగా
వెంకన్న గిరి ప్రదక్షిణ



స్వామివారిని గిరి ప్రదక్షిణకు తీసుకెళ్తున్న దృశ్యం

- గరుడాద్రి చుట్టూ పోటెత్తిన భక్త జనం

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న గిరి ప్రదక్షిణ కార్యక్రమం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. దశావతారాల్లో పదో అవతారమైన కల్కి రూపంలో స్వామివారు స్వయం వ్యక్తమై కొలువుదీరిన గరుడాద్రి పర్వతం చుట్టూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా కనుమనాడు జరుపుతారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని పుణ్యకోటి వాహనంపై ఉంచి, గరుడాద్రి పర్వతం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారిని ఉత్సవమూర్తులను ఉంచిన వాహనాన్ని మోసేందుకు వందలాది మంది భక్తులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి ముందు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ స్వామివారికి నిత్యార్చనలు, బాలభోగ నివేదన, రాజభోగ నివేదన, విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కడియం నుంచి తెచ్చిన పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. స్వామివారి వాహనంతోపాటు వందలాదిమంది గరుడాద్రి పర్వతం చుట్టూ తిరిగారు. అనంతరం బంధుర సరస్సు వద్ద ఉన్న మండపంలో స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కరిమకర సంవాద కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పోటీ పడి అరటి గెలలు స్వామివారికి కానుకగా సమర్పించుకున్నారు. గిరిప్రదక్షిణలో ఉపమాక శ్రీనివాస భక్తసమాజం సభ్యులు భజనగీతాలు ఆలపించారు. టీటీడీ వారు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి స్వామివారి దర్శనం కల్పించారు.



ఉభయ దేవేరులతో స్వామివారు

న్యూస్‌రీల్

పసిబిడ్డల తీర్థం



పసిబిడ్డల తీర్థానికి బిడ్డలతో హాజరైన తల్లులు

రావికమతం: కొత్తకోట గ్రామంలో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం పసిబిడ్డల సంబరం ఘనంగా జరిగింది. రాంబయ్యమ్మ తీర్థంగా పిలిచే ఈ ఉత్సవానికి వారం రోజుల పసికందును సైతం తీసుకువస్తారు. అమ్మవారి ఆలయం చుట్టూ బిడ్డతో ప్రదక్షిణ చేసి అమ్మవారికి బిడ్డలను చూపించి సుఖసంతోషాలతో ఉండేలా బొట్టుపెట్టి తీసుకు వెళ్తుంటారు. ఈ సంబరానికి బిడ్డలతో పెద్ద ఎత్తున తల్లులు హాజరయ్యారు.

జూదగాళ్లపై కేసులు

అనకాపల్లి: జిల్లాలో సంక్రాంతి వేళ మద్యం, ఇసుక, గంజాయి రవాణా చేస్తున్నవారు, కోడి పందాలు, జూదం ఆడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పేకాట, బల్లాట తదితరాలపై 24 కేసులు నమోదు చేసి 96మందిని అదుపులోకి తీసుకుని రూ.93,090 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కోడి పందాలపై దాడులు చేసి 38 కేసులు నమోదు చేసి, 114 మందిని అరెస్టు చేసి, 94 పందెం కోళ్లు, రూ.48,110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గొర్రె, మేక జంటలకు పెళ్లి



గొర్రెల జంటకు మెడలో పసుపుకొమ్ము కట్టి వివాహం జరిపిస్తున్న దృశ్యం

రావికమతం: కనుమ పండుగ రోజు రావికమతం మండలం గొల్లలపాలెం గ్రామంలో గొర్రెల జంటకు, మేకల జంటకు వివాహం జరిపించే వింత ఆచారం ఈ ఏడాదీ కొనసాగింది. ఆ గ్రామంలో యాదవ కులస్తులు గొర్రెలు, మేకల పెంపకమే ఆధారంగా జీవిస్తున్నారు. పూర్వీకుల కాలంలో వింత జబ్బులు పడి మందలకు మందలే మృతి చెందుతుండటంతో ఆ గ్రామ పెద్దలు ఈ సాంప్రదాయాన్ని పాటించేవారు. అదే ఆచారాన్ని తాము కొనసాగిస్తున్నామని సంఘ నాయకులు బర్నికాణ రాములు, పల్లా దేముడు, బుద్దల చిన్న తదితర్లు తెలిపారు.

సొరంగం వద్ద పటిష్ట భద్రత

- పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పహారా
- పరిశీలించిన తహసీల్దార్.. కలెక్టర్‌కు నివేదిక
- సందర్శించనున్న పురావస్తు శాఖ అధికారులు

రావికమతం: కొమిర గ్రామంలో బయల్పడిన సొరంగం వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది 24 గంటలూ పహారా కాస్తున్నారు. ఆ గ్రామంలో ఆదివారం ఇంటింటి కుళాయి పనులు చేస్తుండగా సొరంగం బయట పడిన సంగతి తెలిసిందే. దీనిపై సాక్షిలో సోమవారం వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. సొరంగం లోతుగా లోపల వెడల్పుగా ఉండటంతో ఎవ్వరినీ దిగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సొరంగం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. సొరంగంపై ఇనుప చట్రాలను మూత వేయించారు. పండగ సమయం కావడంతో జన సంచారం ఎక్కువగా ఉంటుందని ఎవ్వరూ దిగే ప్రయత్నం చేయకుండా చూడాలని అక్కడి సిబ్బందికి ఆదేశించారు. దీనిపై ఒక నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపామని, అక్కడి నుంచి ఆదేశాలు వచ్చాక తదుపరి చర్యలు చేపడతామని అన్నారు. పురావస్తు శాఖ అధికారులు కూడా రెండు రోజుల్లో వస్తారని తెలిపారు.

రాజుల కాలంనాటిదే

కొమిర గ్రామంలో బయల్పడిన సొరంగం గురించి ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితం కావడంతో జిల్లా సమాచార శాఖ అధికారి సాయిబాబా ఆ వార్తను చదివి స్పందించారు. సోమవారం ఆయన సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. మాడుగుల స్వస్థలం కావడంతో ఆయన రాజుల కాలంనాటి సంగతులు పంచుకున్నారు. మాడుగులలో రాజుల కాలంలో ఈ ప్రాంతంలో ప్రవహించే నదులపై వంతెనలు ఉండేవి కావని, అత్యవసర సమయాలలో ప్రయాణం సాగించేందుకు, రహస్య సమాచారాలను చేరవేసేందుకు ఒకచోటి నుంచి మరొక చోటికి సొరంగాలు తవ్వి ఆ మార్గాల ద్వారా వెళ్లేవారని తమ పెద్దలు చెప్పేవారని, ఇదీ అటువంటిదై ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.



మంగళవారం నాటికి మరింత బయల్పడిన సొరంగ మార్గం



సొరంగం వద్ద పహారా కాస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

'మళ్లీ గెలిపిస్తాం జగన్' పాట విడుదల

నాతవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలు దేశ ప్రజలందరూ చర్చించుకునే విధంగా ఉన్నాయని సినీ నటుడు, రాష్ట్ర కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు అన్నారు. స్వగ్రామమైన చెర్లోపాలెంలో మంగళవారం తీర్థ మహోత్సవం సందర్భంగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో కలిసి 'మళ్లీ గెలిపిస్తాం జగన్' పాటను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ సాగే ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ముందుగా దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ ఏడాది కిందటికీ ఇప్పటికీ ఊహించని విధంగా గ్రామాల్లో మార్పు కన్పిస్తోందన్నారు. మారుమూల గ్రామాలకు సైతం ఈ పాట చేరేలా కృషి చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా అందించే సంక్షేమ పథకాలే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సర్పంచ్ పైల శిరీష, ఎంపీటీసీ సభ్యురాలు మాకిరెడ్డి సంతోషి, పార్టీ నేతలు లోకవరపు రామునాయుడు, కొల్లి శ్రీను పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద పాటను విడుదల చేస్తున్న రాష్ట్ర కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు

అరే.. ఇది మన బడేనా!

- మనం చదివిన పాఠశాల ఎంత అభివృద్ధి చెందిందో!
- ఆశ్చర్య ఆనందాలతో లక్ష్మీపురం పూర్వ విద్యార్థులు

చోడవరం రూరల్: విరిగిపోయిన బెంచీలు.. చెట్టు కింద క్లాసులు.. రంగు వెలసిన గోడలు.. శిథిలావస్థలో భవనాలు.. ఒకనాటి ప్రభుత్వ బడుల దుస్థితి.. ఇప్పుడు అందుకు భిన్నంగా కళకళలాడుతున్న తమ పాఠశాలను చూసి సంక్రాంతికి సొంతూరు వచ్చిన పూర్వ విద్యార్థులు ఆశ్చర్యపోయారు. తమ స్కూలు ఇంత అభివృద్ధి చెందుతుందని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా లక్ష్మీపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎప్పుడూ సమస్యలతో సావాసం చేసేది. సర్కారు బడి అంటే అందరికీ అలుసే. మొక్కుబడిగా నిర్వహించేవారు. ఇప్పుడు ×మన బడి నాడు–నేడు× కార్యక్రమంలో కనీవినీ ఎరుగని రీతిలో పాఠశాలను కార్పొరేట్ స్కూలు తరహాలో తీర్చిదిద్దడంతో పూర్వ విద్యార్థులు ×అరే.. ఇది మనం చదివిన బడేనా× అని ఆశ్చర్యపోయారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాల నిమిత్తం స్థిరపడిన లక్ష్మీపురం గ్రామానికి చెందిన శిరిసోళ్ల వరహాలునాయుడు, పందూరి నాగేశ్వరరావు, బంటు శ్రీనివాసరావు, పడాల భాస్కర్, గుమ్మాల త్రినాథ్, కంఠంరెడ్డి శ్రీనివాసరావు తదితరులు సంక్రాంతికి తమ స్వగ్రామానికి వచ్చి, సోమ, మంగళవారాల్లో తమ పాఠశాలను సందర్శించారు. వారిని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భూతనాధు రామారావు, పూర్వ చైర్మన్ ఎస్.వరహాలునాయుడు కలిశారు. రూ.63 లక్షలతో తరగతి గది భవనాల మరమ్మతులు, నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీషు మీడియంతోపాటు, టోఫెల్ శిక్షణ సైతం అందిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.వి.జగన్నాథరావు వివరించారు. తాము ఇపుడు చదువుకుంటే ఎంతో బాగుండేదని, ఇంగ్లీషు అంటే భయపడే తమకు నేడు పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన చేస్తుండడం ఒకింత ఈర్ష్య కలిగిస్తోందని పూర్వ విద్యార్థులు చెప్పారు. మనోగతం మాటల్లోనే....





లక్ష్మీపురంలోని హైస్కూల్ (ఇన్‌సెట్) ఆనాడు చదువుకున్న తరగతి గదిలో కూర్చొని మురిసిపోతున్న పూర్వ విద్యార్థులు

ఊరు మారింది

గర్వపడుతున్నా..



నేను (1993–1998 బ్యాచ్) చదువుకున్న కాలంలో మా ఊరి విద్యార్థులే ఉండేవారు. నేడు పట్టణ ప్రాంతమైన చోడవరం నుంచే కాకుండా చుటుపక్కల ఉన్న దామునాపల్లి, మైచర్లపాలెం, వరహాపురం, తునివలస, ఖండిపల్లి, అడవి అగ్రహారం, నర్సయ్యపేట, గోవాడ వంటి సుదూర గ్రామాల నుంచి విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారంటే ఇక్కడి విద్యాబోధన, వసతులే కారణం. ఒక సైనికునిగా దేశం పట్ల ఎంత గర్వపడతానో.. మా ఊరి బడిని చూసి ఇప్పుడు అంతే గర్వపడుతున్నాను.

– పందూరి నాగేశ్వరరావు, ఆర్మీ ఉద్యోగి

కాంపిటీటివ్ స్కిల్స్ పెరుగుతాయి



నేను (1999–2004 బ్యాచ్) చదువుకునేటప్పుడు పోటీ పరీక్షలకు వెళ్లడానికి తగిన నైపుణ్యం అందించే సౌకర్యం పాఠశాలలో ఉండేది కాదు. కానీ నేడు అమలు చేస్తున్న బోధనా సంస్కరణలు ఇప్పటి పిల్లల్లో మంచి స్కిల్స్‌ను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. వారికి ట్యాబ్‌లను అందచేయడంతో పాటు తరగతుల్లోను డిజిటల్ విధానంలో విద్యాబోధన చేయడం కలలో కూడా ఊహించనిది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నూటికి నూరు మార్కులు వేయవచ్చు.

–పడాల భాస్కర్, డిప్యూటీ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సామర్లకోట

విద్యారంగ అభివృద్ధే అసలైన ప్రగతి



నేను (1995–1999 బ్యాచ్) చదినపుడు ఉన్న స్కూల్లో ఎలాంటి వసతులు ఉండేవి కావు. నేడు విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా టాయిలెట్లు, భోజనశాల, సైకిల్ స్టాండ్లు, తరగతుల్లో ఫ్యాన్లు, ట్యూబులైట్లు, విద్యాబోధనలో విప్లవాత్మక మార్పులు చూస్తుంటే ఆనందం కలుగుతోంది. ఈ విధంగా విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తే భవిష్యత్‌లో మన మానవ వనరులు ఎంతగానో వృద్ధి చెందుతాయి. తద్వారా రాష్ట్రం ముందడుగు వేస్తుంది. ఇది ముందుచూపుతో చేస్తున్న అభివృద్ధి అనే చెప్పవచ్చు.

– కంఠంరెడ్డి శ్రీనివాసరావు, హిందీ స్కూల్ అసిస్టెంట్, కస్పా జగన్నాథపురం

నాడు వందమందే.. నేడు వందలమంది...



నేను (2000–2005 బ్యాచ్) చదువుకున్నపుడు పాఠశాలలో అయిదు తరగతుల్లో కలిపి వందమందే విద్యార్థులుండేవారు. నేడు సుమారు ఆరువందల మంది చదువుకుంటున్నారంటేనే మా పాఠశాల సాధించిన అభివృద్ధి ఏమిటో అర్థమవుతోంది. నాడు తాటికమ్మల పాకలు, చింతచెట్టు తరగతి గదులైతే.. నేడు అన్ని తరగతులకు పక్కా భవనాలు, కూర్చునేందుకు బెంచీలు ఉన్నాయి. ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన మా కాలంలో కాన్వెంట్లలోనే సాధ్యపడేది. ఇప్పుడు డిజిటల్ క్లాసులు చెబుతున్నారంటేనే ఎంతటి శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతోంది.

–శిరిసోళ్ల వరహాలునాయుడు, పోలీస్ కానిస్టేబుల్, రావికమతం

నమ్మలేకపోయాను



దళితవాడకు వెళ్లే రోడ్డుపై నిలబడి ఫొటో తీయించుకున్న రైల్వే ఉద్యోగి ఈశ్వరరావు

ఆయన పేరు కోరుకొండ ఈశ్వరరావు. మునగపాక దళితవాడకు చెందిన ఆయన గౌహతిలో రైల్వే హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. సంక్రాంతికి మునగపాక వచ్చారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి చూసి ఎంతో ఆనందించారు. దళితవాడకు వెళ్లాలంటే గతంలో అవస్థలు పడేవారమని, నేడు రూ.38 లక్షలతో రహదారి నిర్మించడంతో ఎంతో సౌకర్యంగా ఉందని, ఇది చూసి తాను నమ్మలేకపోయానని చెప్పారు. అన్ని కులాలకు సంబంధించిన శ్మశానవాటికల రూపురేఖలు మారిపోయాయని, నాడు-నేడుతో పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మునగపాక ముఖచిత్రంలో అప్పటికీ ఇప్పటికీ అసలు పోలికే లేదన్నారు.

-మునగపాక

క్లుప్తంగా

నా కుమారుడికి ఎంపీ టికెట్ ఇవ్వమని కోరాను

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ టికెట్ ఇవ్వమని చంద్రబాబును కోరినట్టు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. నర్సీపట్నంలో శ్రీస్వామి అయ్యప్పదేవస్థానం నిర్వహించిన మకరజ్యోతి ఉత్సవాల్లో అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో తనయుడి రాజకీయ ప్రవేశంపై అయ్యన్నపాత్రుడు ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. 'నా పెద్ద కొడుకు విజయ్‌కు అనకాపల్లి ఎంపీగా అవకాశం ఇమ్మని అధిష్టానానికి దరఖాస్తు చేశా.. అయ్యన్న కొడుగ్గా ఎంపీ టిక్కెట్టు ఇవ్వొద్దు.. టాలెంట్ ఉంటేనే ఇవ్వమ'ని చెప్పానని పేర్కొన్నారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయండి

- ఆర్టీసీ డ్రైవర్లకు ఎస్సై సుధాకర్ అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై దివాకర్

నర్సీపట్నం: ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయటం వల్ల రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని టౌన్ ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఎదురుగా వచ్చే వాహనం పరిస్థితిని అంచనా వేయాలన్నారు. డిపో మేనేజర్ ధీరజ్ మాట్లాడుతూ డ్రైవర్లు సాధ్యమైనంత వరకు డ్యూటీ దిగిన అనంతరం విశ్రాంతి తీసుకోవాలన్నారు. వందల మంది ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయన్నారు. మీ కుటుంబం మీపై ఆధారపడిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సులు నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో గ్యారేజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.ఆచారి, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రప్పందాలు షురూ



పరుగు తీస్తున్న గుర్రం

- గ్రామ తీర్థాల్లో మొదలైన పోటీ
- గుర్రాల పెంపకంపై యువకుల ఆసక్తి



జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

చోడవరం: గ్రామాల్లో గుర్రప్పందాల సందడి మొదలైంది. సంక్రాంతి తర్వాత వచ్చే గ్రామీణ తీర్థాల్లో వీటి కోలాహలమే కనిపిస్తోంది. ఎక్కడ చూసినా ప్రజల చప్పట్లు, ఈలల మధ్య మెరుపు వేగంతో జాతిగుర్రాలు దూసుకుపోతున్నాయి. కనురెప్పలో తన లక్ష్యాన్ని ఛేదించి బహుమతులు ఎగురేసుకుపోతున్నాయి. ఒకప్పుడు టక్‌చిక్..టక్‌చిక్...గిట్టల శబ్దం వచ్చిందంటే రైలు బండి వేగాన్ని తలపించే గుర్రం జట్కా బళ్లు అందరికీ గుర్తుకొస్తాది. రవాణా సౌకర్యాలు లేని రోజుల్లో గుర్రం జట్కా బళ్లే ప్రధాన రవాణా వాహనంగా ఉండేవి. మారిన కాలంలో జట్కా బళ్లు కనుమరుగవడంతో కొంత కాలం గుర్రాల గిట్టల శబ్దం, కనురెప్పలో తన పరుగుతో లక్ష్యాన్ని ఛేదించే మేలు రకం జాతి గుర్రాలు సైతం ఈ ప్రాంతంలో అంతరించిపోయాయి. ఇప్పుడు మరలా చల్ ఛల్ గుర్రం...చలాకీ గుర్రం... అంటూ గుర్రాలు పరుగులు తీస్తున్నాయి. రాజుల కాలంలో ఓ వెలుగు వెలిగిన గుర్రపు స్వారీ, పరుగు పందాలు, ఇప్పుడు మరలా గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. కేవలం క్రీడా స్ఫూర్తితో నిర్వహించే గుర్రాల పరుగు పందాలపై జనం ఆసక్తి కనబరుస్తుండటంతో సంక్రాంతి తీర్థాల నుంచి గ్రామదేవతల పండగలు వరకు నిర్వహిస్తున్నారు. జైపూర్ మహారాణి పాలించిన మాడుగులలో దసరా రోజున ప్రత్యేకంగా గుర్రాల సంత జరుగుతోంది. ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లేందుకు మైదాన గిరిజన గ్రామాలకు చెందిన వారు నేటికీ గుర్రాలనే రవాణాకు ఉపయోగిస్తున్నారు. దీనితో మైదాన గిరిజన గ్రామాల్లో వీటి పెంపకం పెరిగింది. ప్రస్తుతం సంక్రాంతి తీర్థాలు ప్రారంభం కావడంతో గుర్రాల దౌడు మొదలైంది.

ఈ ప్రాంతాల్లో పోటీలు..

చోడవరం, కొత్తకోట, దొండపూడి, టి.అర్జాపురం, రావికమతం, మాడుగుల, అచ్యుతాపురం, పాయకరావుపేట, నర్సీపట్నం, కోటవురట్ల, రాంబిల్లితోపాటు రాజరిక కీర్తిని సంతరించుకున్న పద్మనాభం, ఎస్.కోట, భీమిలి, ఆనందపురం ప్రాంతాల్లో ఏటా సంక్రాంతి పండగ తర్వాత గుర్రపు పందాలు జోరుగా నిర్వహిస్తుంటారు. ఈ పందాల కోసం రాజస్థాన్, గుజరాత్, హైదరాబాద్, జైపూర్, కటక్ ప్రాంతాల నుంచి మేలు జాతి గుర్రాల కొనుగోలు చేసి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.

ఆకట్టుకున్న జిల్లా స్థాయి పోటీలు

మునగపాక: స్థానిక సంతబయిల అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. 14 ప్రాంతాల నుంచి వచ్చిన గుర్రాలు పాల్గొన్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. మునగపాక బైపాస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాల్లో ప్రజలను ఉత్సాహ పరిచేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంతబయిల యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, పెంటకోట విజయ్, అజయ్, కాండ్రేగుల మణికంఠ, ఆడారి గోవింద, శరగడం జగన్, దాడి అప్పలనాయుడు, పెంటకోట శివగణేష్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



గుర్రపు పరుగు పోటీలను తిలకించేందుకు హాజరైన జనం

రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం



గుర్రపు స్వారీ చేయడం చాలా ఆనందంగా ఉంటోంది. రెండేళ్లల్లో తూర్పుగోదావరి జిల్లా తుని, సామర్లకోటలో రాష్ట్ర స్థాయి పోటీల్లో నా గుర్రం మొదటి స్థానం సాధించింది. ప్రస్తుతం జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రుద్ర రైడర్ పేరుతో నా గుర్రాన్ని పరుగుల పోటీకి దించాలని సిద్ధం చేశాను.

– దాడి కోటేశ్వరరావు, గుర్రపు స్వారీ చేసేవాడు, రాయపురాజుపేట

ఆ మజానే వేరు..



పోటీలో పాల్గొనే గుర్రాలకు మంచి దాణా పెట్టాలి. మేలు జాతి గుర్రాలైతే రూ.2 నుంచి 3 లక్షలు వరకు ధర ఉంటోంది. ఇటువంటి గుర్రంపై స్వారీ చేస్తే ఆ మజానే వేరు, నేను రూ.1.30 లక్షలు పెట్టి గుర్రాన్ని కొన్నాను. అనేక సార్లు పోటీల్లో పాల్గొని చాలా బహుమతులు సాధించాను.

– రాజేష్, గుర్రం పెంపకందారుడు, గోపాలపట్నం

వడ్డాదిలో యువకుల మధ్య ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయం



గాయపడిన తేజ

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది యువకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కనుమ పండగ సందర్భంగా మంగళవారం వడ్డాదికి దూరంగా కొంతమంది గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు నిర్వహించారు. అక్కడకు వెళ్లిన రెల్లివీధి, దొరబాబు కాలనీ యువకులు గొడవ పడ్డారు. ఇదే విషయమై రాత్రి వడ్డాది జంక్షన్‌లో సినిమా హాలు దగ్గర రెల్లివీధి యువకుడిపై దొరబాబు కాలనీ యువకులు దాడి చేశారు. కోడి కత్తితో దాడి చేయడంతో రెల్లివీధి యువకుడు తేజ మెడపై గాయమైంది. తీవ్ర రక్తస్రావమైన అతడ్ని స్థానికులు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. దీంతో రెల్లివీధి యువకులు వడ్డాది బీఎన్ రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసి సినిమాహాలు, ఇతర దుకాణాలు మూయించడానికి ప్రయత్నించారు. పోలీసులు, నాయకులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీనిపై ఎస్‌ఐ డి. ఈశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన అందుబాటులో లేరు.

ఉత్సాహంగా లెజెండ్ క్రికెట్ లీగ్



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో లెజెండ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన అయిదు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో నేతాజీ యువజన సంఘం టీం విన్నర్‌గా, రన్నర్‌గా వివేకానంద టీం నిలిచాయి.

పండగ పూట పెను విషాదం

- చంద్రయ్యపేటలోలో స్వాగత ఫ్లెక్సీలు కడుతుండగా విద్యుత్తు షాక్
- ఇద్దరు యువకుల మృతి
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సంతాపం

వారిద్దరిది ఒకే గ్రామం.. ఒకే చోట కలిసి పని చేస్తున్నారు.. కుటుంబీకులకు కొత్త బట్టలు కొన్నారు. ఆనందంగా పండగ జరుపుకోవాలని ఇంటికి చేరుకున్నారు. ఇంతలోనే మృత్యువు రూపంలో వచ్చిన కరెంటు తీగలు కాటేశాయి. కళ్ల ముందే వారు మృత్యువాత చెందడంతో స్నేహితులు మ్రాన్పడిపోయారు. ఈ విషాద ఘటన చంద్రయ్యపేటలో నెలకొంది.

కె.కోటపాడు: పండగ పూట విషాదం నెలకొంది. గ్రామానికి విచ్చేసే వారికి స్వాగతం పలికేందుకు తోటి స్నేహితులతో కలిసి ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురైన ఇద్దరు యువకులు మృతి చెందారు. దాంతో చంద్రయ్యపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన గవిరెడ్డి ఎర్రునాయుడు(34), బోకం సురేష్(34) జీవీఎంసీలో ప్రైవేటు ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ ఆదివారం విధులు పూర్తయిన తర్వాత గ్రామానికి చేరుకున్నారు. స్నేహితులు గవిరెడ్డి త్రినాథ్, సబ్బవరపు ప్రసాద్ ఇక్కడ సంక్రాంతి పండగ ఫ్లెక్సీల ఏర్పాటుకు మంచినీటి ట్యాంక్ సమీపంలో గోతులు తీశారు. వాటిల్లో ఐరన్ ఫ్రేమ్ ఫ్లెక్సీలను నిలబెట్టారు. ఆ సమయంలో గాలి వీయడంతో ఐరన్ ఫ్రేమ్‌తో ఉన్న ఫ్లెక్సీ పక్కన హెచ్‌డీ లైన్ విద్యుత్ తీగల వైపు వాలిపోయింది. పడిపోతున్న దాన్ని పట్టుకునేందుకు బోకం సురేష్, గవిరెడ్డి ఎర్రునాయుడు యత్నించారు. ఆ సమయంలో ఐరన్ ఫ్రేమ్ ఫ్లెక్సీకి విద్యుత్ ప్రవాహం కావడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే వీరిని స్నేహితులు రక్షించేందుకు యత్నించారు. షాక్‌కు గురైన సురేష్ సంఘటనా స్థలంలో మృతి చెందగా, మెరుగైన వైద్యానికి ఎర్రునాయుడును తరలించే సమయంలో మృతి చెందాడు.



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన ఎర్రునాయుడు



ప్రమాదంలో మృతిచెందిన సురేష్

చంద్రయ్యపేటలో విషాద ఛాయలు

తెల్లారితే కుటుంబ సభ్యులతో ఆనందంగా పండగను నిర్వహించుకునే సమయంలో విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు సురేష్‌కు భార్య భారతి, కుమార్తె ఉన్నారు. మరో మృతుడు ఎర్రునాయుడుకు భార్య రామలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పండగకు ఇంట్లో పిల్లలకు, పెద్దలకు బట్టలు తీసుకువచ్చిన వీరు కొద్ది సేపటికే తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో వారి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. సమాచారాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. మృతుడు ఎర్రునాయుడు భార్య రామలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ ధనుంజయ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మృతదేహాలకు అనకాపల్లిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రోజు వ్యవధిలోనే చోరీ కేసు ఛేదన

- ముగ్గురు నిందితుల అరెస్టు
- 14.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- విసన్నపేటలో ఘటన



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు నగలు (ఇన్‌సెట్) చోరీ గురించి వివరిస్తున్న సీఐ వినోద్‌బాబు

కశింకోట: మండలంలోని విసన్నపేట గ్రామంలో భారీ బంగారు నగల దొంగతనం జరిగిన ఒక రోజు వ్యవధిలోనే నిందితులను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించి ప్రజల మన్ననలు పొందారు. సీఐ ఎం. వినోద్‌బాబు వివరాల ప్రకారం... విసన్నపేటలో టైలర్ చెక్కా కుమారి తన ఇంటి తలుపులకు తాళం వేయకుండా నిద్రిస్తుండగా, ఈ నెల 14న అర్ధరాత్రి ముగ్గురు దొంగలు ప్రవేశించి పూజ గదిలో ట్రంకు పెట్టిలో ఏడు రకాల 14.5 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. నాలుగు బంగారు గాజులు, హారం, నల్ల పూసల దండ, నక్లెస్, రెండు జతల చెవి ఆభరణాలు, ఉంగరం దొంగిలించారు. వీటి మార్కెట్ విలువ రూ.10 లక్షలు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో లఘుశంక కోసం నిద్ర లేచి తలుపునకు గడియ వేసి ఉన్న సంగతి గుర్తించింది. నానా తంటాలు పడి గడియ తీసి పక్క పూజ గదికి వెళ్లి పరిశీలించగా పెట్టెలో నగలు కనిపించలేదు. ఈ విషయాన్ని విశాఖలో ఉంటున్న కుమారుడు రమేష్‌కు ఫోన్లో చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వినోద్‌బాబు తమ సిబ్బందితో రంగ ప్రవేశం చేసి సంఘటన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఇది స్థానికుల పనే అయి ఉంటుందని గుర్తించి ఆ దిశగా విచారణ చేశారు. కుమారి ఇంటి పక్కన ఇంట్లో ఉంటున్న షేక్ ముజెబ్ మరో ఇద్దరు స్నేహితులు దామరౌతు నవీన్‌కుమార్, మైనర్ బాలుడిని ఒప్పించి దొంగతనానికి పథకం వేసి ఆచరణలో అమలు చేసి సఫలీకృతులయ్యారు. వీరు ముగ్గురు చెడు వ్యసనాలకు లోనై ఒంటరిగా ఉంటున్న కుమారి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. చోరీ నగలను వాటాలు వేసుకొని గ్రామ శివారులో రాళ్ల కింద దాచిపెట్టారు. ఈ నేపథ్యంలో చోరీ తర్వాత వీరు గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారిని పట్టుకుని విచారిస్తే నేరం అంగీకరించారు. బంగారు నగలను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఈ మేరకు విశాఖ కేంద్ర కారాగారానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు. చోరీ కేసు ఛేదించి దొంగలను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టిన సీఐని స్థానికులు అభినందిస్తున్నారు.

అంబరాన్నంటిన మకరజ్యోతి సంబరాలు

- సినీ నటులకు సన్మానం
- స్వామివారి రథయాత్రలో చిడతల కోలాటాలు



గేయాలతో అలరిస్తున్న గజల్ శ్రీనివాస్



మకరజ్యోతిని తిలకిస్తున్న ప్రజలు



సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి అయ్యన్న



పూజ చేస్తున్న కొణతాల లక్ష్మీనారాయణ



మహిళల దాండియా నృత్యం

నర్సీపట్నం: స్వామి అయ్యప్ప సేవా సంఘం వారు నిర్వహించిన మకరజ్యోతి మహోత్సవాలు అంబరాన్ని తాకాయి. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన మకరజ్యోతి మహోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ, టీవీ గజల్ గాయకుడు, నటుడు సత్యసాయి శ్రీనివాస్, వర్ధమాన గాయని పెదిరెడ్ల సుజాత పాల్గొన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గేయాలు ఆహూతులను ఎంతగానో ఉర్రూతలూగించాయి. పండగ రోజున మకరజ్యోతి మహోత్సవాల్లో పాల్గొనటం తమకెంతో ఆనందం కలిగిస్తుందని నటులు అన్నారు. మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సినీ నటులను ఘనంగా సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా మకరజ్యోతి మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సంక్రాంతి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అయ్యప్ప ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పంచామృతాభిషేకాలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయ ఆవరణంలో విష్ణు సహస్ర నామపారాయణం, అవతార మెహెర్‌బాబా సంకీర్తనలు, సత్యసాయి సంకీర్తనలు ఆలపించారు.

సాయంత్రం చిడతల కోలాటాలు, భజనల మధ్య స్వామివారి రథయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. మకరజ్యోతి మహోత్సవాలు ఉట్టిపడేలా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. మిరమిట్లు గొలిపే బాణసంచా పేలుళ్లతో స్టేడియం దద్దరిల్లింది. మకరజ్యోతి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు.

అయ్యప్పస్వామి ఆలయంలో మకరజ్యోతి వేడుకలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వద్ద గౌరీపంచాయతన దేవాలయంలోని అయ్యప్పస్వామి మకర సంక్రాంతి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేరళ వాయిద్యాలు, మహిళల దాండియా, తప్పెడు గుళ్లు, కాంగో కోలాటలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మకరజ్యోతి దర్శనం వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకులు పొందూరు సూర్యనారాయణ శాస్త్రీ, శేషు, సాయి మూల విరాట్ పంచామృత అభిషేకాలు, అయ్యప్ప స్వామికి వంద తులాల బంగారు ఆభరణాలు ఊరేగించారు. ఈ ఏడాది ప్రత్యేకంగా కాశీ హారతులు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ ప్రారంభించి అయ్యప్ప స్వామి 18 మెట్ల హారతులు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, అయ్యప్ప స్వామి ఆలయ కన్వీనర్ మళ్ల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కనులపండువగా గజేంద్రమోక్ష ఉత్సవం

- వరదరాజస్వామి అలంకారంలో దర్శనమిచ్చిన సింహాద్రి అప్పన్న
- గజవాహనంపై విశేషంగా తిరువీధి
- పరవశించిన భక్తజనం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి గజేంద్రమోక్షం(మకరవేట) ఉత్సవం మంగళవారం కనులపండువగా జరిగింది. ఆపదల్లో ఉన్నవారెవరైనా పిలిచిన వెంటనే ఏదొక రూపంలో భగవంతుడు వచ్చి రక్షిస్తాడని, మొసలి బారిన పడిన గజేంద్రుడి చరిత్రే దానికి నిదర్శనమని చాటిచెబుతూ ఈ ఉత్సవాన్ని ఏటా కనుమ రోజు నిర్వహించడం ఆనవాయితీ. కొండదిగువ పూలతోటలో సింహాచలం దేవస్థానం వైదికులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కనులారా తిలకించిన భక్తులు.. భక్తి పారవశ్యంలో మునిగితేలారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామి అలంకరణ చేసి.. సాయంత్రం సింహగిరి నుంచి మెట్లమార్గం ద్వారా కొండదిగువకు తీసుకొచ్చారు. తొలిపావంచా వద్దకు చేరుకున్న స్వామికి అడవివరం గ్రామస్తులు, దేవస్థానం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వామిని ఆయన సోదరి అయిన అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామికి మహిళలు మంగళహారతులిచ్చారు. అక్కడి నుంచి స్వామిని పూలతోటకి తీసుకెళ్లి ప్రధాన మండపంలో అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహావాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం భాగవత పురాణ విన్నపం, గజేంద్ర మోక్షం ఘట్ట విన్నపం చేశారు. తదుపరి స్వామిని అక్కడి నుంచి పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొచ్చి గజవాహనంపై అధిష్ఠించారు. అదే వాహనంపై రాత్రి గ్రామ తిరువీధి విశేషంగా చేపట్టారు. తమ ఇళ్ల ముందుకి వచ్చిన స్వామికి గ్రామస్తులు హారతులిచ్చారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, చక్రవర్తి, చిన్నా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. పూలతోటను పెద్ద ఎత్తున విద్యుద్దీపకాంతులతో అలంకరించారు. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా ఉత్సవాన్ని పురస్కరించుకుని పూలతోటలోని శ్రీకృష్ణ కొలను వద్ద మూడు సార్లు వెలిగించిన జువ్వలు మూడు వెళ్లి.. తిరిగి రావడంతో ఈ ఏడాది వరి, అపరాలు, మెట్ట పంటలు బాగా పండుతాయని భక్తులు విశ్వసించారు. ఏటా వరి, అపరాలు, మెట్ట పంటలు ఎలా పండుతాయో అని తెలుసుకునేందుకు ఈ విధంగా చేయడం ఆనవాయితీగా వస్తోంది.



గజవాహనంపై స్వామి గ్రామ తిరువీధి



బాణసంచా వెలుగులు.. తిలకిస్తున్న భక్తులు



కొండపై నుంచి కొండదిగువకి స్వామిని తిరువీధిగా తీసుకొస్తున్న అర్చకులు, ఈవో శ్రీనివాసమూర్తి

క్లుప్తంగా

నేడు ఏఎంసీ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లి : స్థానిక 82వ వార్డు కార్పొరేటర్ పరిధిలో విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమం బుధవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సుర వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యామిలీ వైద్యుడు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, కంటి వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లి : ఈ నెల 19న విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఎ.జె.చిన్నకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, స్థానిక ప్రజలు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సందడిగా వీరన్న తీర్థం



వీరన్న తీర్థంలో ప్రజలు

అనకాపల్లి : చినమాకవరం గ్రామంలో కోరు కొండపై వెలసి ఉన్న వీరాస్వామి(వీరన్న) తీర్థం మంగళవారం సాయంత్రం కనుల పండువలా జరిగింది. మాకవరం, మార్టూరు, మామిడిపాలెం, కొండుపాలెం, సీహెచ్.ఎన్. అగ్రహారం, రేబాక పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పొలాల గట్ల మీదుగా కోరుకొండకు చేరుకుని మెట్ల మార్గం లేకపోయినా ఇనుపగొట్టాల ఆసరాతో కొండ ఎక్కారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు, యువకులు, కొత్తగా పెళ్లయిన దంపతులు పెద్ద ఎత్తున ఉదయం నుంచే వీరాస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి గుడి నుంచి విసిరే అరటి పళ్లు, కొబ్బరి చెక్కలను పట్టుకొని ప్రసాదంగా భక్తులు స్వీకరించారు. కొండ దిగువన స్వామివారి తీర్థం జరిగింది. పంచదార చిలుకలు, చిన్నపిల్లల ఆట వస్తువులు విక్రయాలు జోరుగా సాగాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 6,920 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,550	4,570
మొదటి రకం	3,610	4,140
రెండో రకం	3,530	3,870
మూడోరకం	3,360	3,520

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం : రాజా
గుంటూరు కారం : సత్యనారాయణస్క్రీన్-1
హనుమాన్ : సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ : షిర్డిసాయి
సైంధవ్ : పర్తిసాయి
గుంటూరు కారం(రెండుషోలు)
సలార్ (రెండుషోలు) : వెంకటేశ్వర
తికమక తాండ : శ్రీసత్య
హనుమాన్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 111 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11 యూనిట్లు, బీ పాజిటివ్–28 యూనిట్లు, ఓ పాజిటివ్–59 యూనిట్లు, ఏబీ పాజిటివ్–9 యూనిట్లు, ఓ నెగిటివ్–3 యూనిట్లు, ఏబీ నెగిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 237 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 494 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పెద్ద పండగ...ఊరూరా సంబరంగా...



ఇంటింటా చెట్టుభజన కార్యక్రమం చేస్తున్న మహిళలు





సంప్రదాయ దుస్తులతో వచ్చిన చిన్నారులకు ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతి అందజేసిన మళ్ల సురేంద్ర



సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాజు



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అనకాపల్లి: పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పట్టణంలో గవరపాలెం, వేల్పులవీధి, లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, గాంధీనగరం, నర్సింగరావుపేట తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల ముంగిట ముత్యాల రంగవల్లికలు తీర్చి, గొబ్బెమ్మలు అమర్చారు. యువతీ, యువకులు సంప్రదాయ దుస్తులు ధరించారు. స్థానిక నెహ్రూచౌక్ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో యువజన విభాగ జిల్లా కార్యదర్శి పాల తీర్థపు రాజు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ విలీన గ్రామమైన కెఎన్ఆర్ పేటలో సీతారామ మహిళా సేవాసంఘం ఆధ్వర్యంలో మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఇంటింటా చెట్టుభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు చూచుకొండ రమణ, మహిళలు పాల్గొన్నారు.

సుంకరమెట్ట జంక్షన్ వద్ద...

స్థానికమెయిన్‌రోడ్డు పొట్టిశ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పి.ఎం.ఎల్.నరసింహం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు నాగార్జున ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు మళ్ల సురేంద్ర బహుమతులు అందజేశారు. అంతకుముందు తెలుగు సాంప్రదాయ దుస్తులతో వచ్చిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో....

స్థానిక నిష్ఠలవారివీధి, లోకావారి వీధిలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రంగోలి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జంగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ 15 మంది పోటీల్లో పాల్గొన్నగా ముగ్గురుకి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో గోపాలపురం, అక్కిరెడ్డివానిపాలెం, తుమ్మపాల, సీతానగరం, మారేడుపూడి, తగరంపూడి, మార్టూరు, రేబాక, శంకరం, ఎన్టీఆర్ కాలనీ, కుంచంగి, కూండ్రం, జగన్నాథపురం, అల్లిఖండువానిపాలెం, మామిడిపాలెం తదితర ప్రాంతాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సందడిగా రంగవల్లుల పోటీలు



కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ముగ్గులు వేస్తున్న మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్



ప్రథమ బహుమతి పొందిన రంగుల ముగ్గు

కశింకోట : కశింకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సోమవారం రాత్రి మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఉత్సాహంగా మహిళలు పోటీలో పాల్గొని రంగులతో ముగ్గులు వేశారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు వేగి వెంకటరావు, ఆళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఎ.ఎస్ పేటలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీ నిర్వహించారు. పోటీకి మహిళల నుంచి విశేష ఆదరణ లభించింది. ముగ్గులను పరిశీలించి విజేతలకు భరత్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ పాల్గొన్నారు.



ముగ్గుల పోటీ పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



ఎ.ఎస్ పేటలో ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న మహిళలు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
- వేడుకగా కొణతాల రామలింగస్వామి పురస్కార్–2024 అవార్డులు



విల్లూరి భార్గవ్ నైమిష దంపతులను సత్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ట్రస్ట్ నిర్వాహకులు



యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకురాలు లక్ష్మీపార్వతి

అనకాపల్లి : దేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, నేటి యువత సంప్రదాయాలను కొనసాగించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. స్థానిక రావుగోపాలరావు రహదారి ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్–2024 ప్రదానోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. తెలుగుభాష గొప్పతనం గురించి ఆయన వివరించారు. సంఘసేవా తత్పరులకు ప్రపంచమే ఒక కుటుంబమన్నారు. నగదుతో కొనే వాటిని సుఖాలని, నగదుతో కొనలేనిది ఆనందం ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. యువత బాధ్యతగా ఇష్టపడి పని చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారని ఆయన చెప్పారు. ప్రపంచ దేశాల్లో తెలుగుభాషకు ఎంతో తియ్యదనం ఉందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త స్వర్గీయ కొణతాల రామలింగస్వామి ట్రస్ట్ పేరుమీద నాలుగేళ్లుగా తెలంగాణ, ఏపీ రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వ్యక్తులకు అవార్డులతో అభినందించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఉపాధ్యాయ రంగంలో చిలుకూరి శ్రీనివాసరావుకు, ఉత్తమ విద్యార్థి రంగంలో విల్లూరి భార్గవ్, వివిధ రంగాల్లో సంఘం సేవకులకు పి.సత్య తిరుపతిరావు పట్నాయక్, రాపర్తి జగదీష్‌కుమార్, మార్గం రాజేష్, సురకాసి రవితేజ, జీరెడ్డి తరుణ్‌కుమార్ అవార్డులో లక్ష్మీప్రసాద్ సత్కరించారు. అంతకుముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి, సభ్యులు కె.ఫణిభూషణ్ శ్రీధర్, శివశంకర్ బాబు, వీరభద్రరావు, కాండ్రేగుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గవరపేటలో వేంకటేశ్వరస్వామికి పూజలు



వేణుగోపాలస్వామి ఆలయంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు చైర్మన్ మారుతి

కశింకోట : సంక్రాంతి, కనుమ సందర్భంగా స్థానిక దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ మహోత్సవం, తోడపెద్దు సేవ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి, లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో వేర్వేరుగా ఊరేగించారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి, గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు ఎక్కువగా దర్శించారు. దేవతమ్మ ఆలయాన్ని కూడా దర్శించి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. అడ్డాం, ఉగ్గినపాలెం, సోమవరం గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి.

పేదలకు వితరణ

సంక్రాంతి సందర్భంగా యువ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రేజేటి మారుతి సుమారు 200 మందికి వస్త్రాలు, ఆర్థిక సహాయం వితరణ చేశారు.

ఘనంగా బౌద్ధ మేళా



బొజ్జన్నకొండ తీర్థంలో జన సందోహం



బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యవతి, తదితరులు

తుమ్మపాల : బొజ్జన్నకొండ వద్ద మంగళవారం విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య అంబేడ్కర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో బౌద్ధ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ బి.వి.సత్యవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధ భగవానుడు, డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ శాంతిని నెలకొల్పే ధర్మమార్గమే బౌద్ధమని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ అన్నారు. జిల్లా మహాబోధి సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ బౌద్ధ భిక్షువులు (నాగపూర్) వెనరబుల్ డాక్టర్ జ్ఞానదీప్ మహాథేరో, వెనరబుల్ బోధిరత్న మహాదేరో బౌద్ధ పతాకావిష్కరణ చేసి బొజ్జన్నకొండపై గల బౌద్ధస్థూపం వరకు పంచశీల శాంతి యాత్ర చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన బొజ్జన్నకొండ తీర్థం ఘనంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో జనం పాల్గొన్నారు.

కోడిపందాల నిర్వాహకులపై కేసులు



కోడిపందాలు ఆడుతూ పట్టుబడ్డ నిందితులతో రూరల్ సీఐ రవికుమార్

అనకాపల్లి : మండలంలో పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి కోడిపందాలు, జూదం, బల్లాటలు ఆడుతున్న శిబిరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేసినట్టు రూరల్ సీఐ రవికుమార్ మంగళవారం చెప్పారు. ఆరు కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి, 15 కోడిపుంజులు, రూ.2,910 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చెప్పారు.

ముగిసిన ఫోర్ బౌండరీ క్రికెట్ పోటీలు



అనకాపల్లి కిసాన్ క్రికెట్ టీమ్‌కు ప్రథమ బహుమతి అందజేస్తున్న కోరిబిల్లి పరి

అనకాపల్లి : క్రీడల ద్వారా ఆరోగ్యంగా జీవించడంతో పాటు, శరీర ఆకృతి బాగుంటుందని సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోరిబిల్లి పరి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఐక్యవేదిక, ఎస్‌డీ గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోర్ బౌండరీ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15, 16 వరకూ నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయన్నారు. విజేతలకు ప్రథమ,ద్వితీయ బహుమతులు రూ.5, రూ.3వేలు షీల్డ్ అందజేశారు. ఆర్గనైజర్లుగా సతీష్, శ్రీను, దివాకర్, రాముడు, కృష్ణ, గంటి రవికుమార్, పాస్టర్ పంద్రణ త్రిమోతి, కేసీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల చందు పాల్గొన్నారు.

ఊరూరా తిరునాళ్లు



కట్టుబోలులో బాల సన్యాసమ్మకు పూజలు



దిమిలిలో భక్తులకు దర్శనమిచ్చిన సంతోషిమాత

రాంబిల్లి : సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా మండలంలో తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం దిమిలిలో సంతోషిమాత, లోవపాలెంలో పరశురామన్న తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కట్టుబోలులో కనుమ పండగ సందర్భంగా మంగళవారం బాల సన్యాసమ్మ తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ, బంధు మిత్రులతో కలిసి తీర్థాల్లో జనం సందడి చేశారు. రంగుల రాట్నాలు ఎక్కి ముచ్చట తీర్చుకున్నారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, భజనలు చేస్తూ తీర్థాల్లో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. ముగ్గులు, ఆటలు , పాటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

డొంకాడలో గంగమ్మతల్లి జాతర



డొంకాడలో తీర్థ మహోత్సవం

నక్కపల్లి: సంక్రాంతి పండగ అంటే తిరునాళ్ల జాతరే.. గ్రామ గ్రామాన వారి వారి ఆచార వ్యవహారాల ప్రకారం తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తారు. పల్లెలు సాంస్కృతిక కార్యక్రమాల సందడితో పాటు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. మండలంలోని డొంకాడ లో కనుమ పండగను పురస్కరించుకుని గ్రామ దేవత గంగమ్మతల్లి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో చిన్నారులు సందడి చేయ గా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీనివాసుడు, అలిమేలు మంగమ్మ, పద్మావతి అవతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక : మండల కేంద్రంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. మేలతాళాలతో పాటు పూలమాలలు వేసి స్వామిని గ్రామంలో అన్ని వీధుల గుండా ఊరేగించారు. అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోడిపందాలపై పోలీసుల దాడులు

ఎస్.రాయవరం : సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడిపందాలు ఆడేవారిని పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. వేమగిరిలో కోడిపందాలపై దాడి చేసి 6 కోళ్లు, ఇద్దరు నిందితులను, దార్లపూడిలో రెండు కోళ్లతో పాటు ఒకరిని పట్టుకున్నామని, ఎస్.రాయవరంలో ఒక కోడి, 6 లాటరీ బల్లలను సీజ్ చేశామని తెలిపారు. అడ్డురోడ్డులో 6 మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

ఉత్తరాయణ పుణ్యకాలంలో ప్రత్యేక పూజలు

- ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి
- వైభవంగా స్వామివారికి తిరువీధి సేవ



స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న దశ్యం

నక్కపల్లి : ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతినాడు ప్రత్యేక పూజలు జరిగాయి. గరుడాద్రి పర్వతంపై కల్కిఅవతారమైన స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున నాలుగు గంటలకు పంచామృతాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు పూర్తిచేసి భక్తులకు దర్శనం కల్పించారు. కొండ దిగువన వేణుగోపాలస్వామి ఆలయంలో, ఆండాళ్లమ్మవారి సన్నిధిలోను స్వామివారు ఉత్సవమూర్తుల వద్ద నిత్య సేవాకాలం, ప్రసాద నివేదన నిత్య హోమం, బలిహరణలు, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థగోష్ఠి జరిగాయి. అనంతరం శ్రీ పద్మావతి, అలువేలుమంగా సమేతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని రాజాధిరాజవాహనంలో, ఆండాళ్లమ్మ వారిని శేషతల్ప వాహనంలో తిరువీధి సేవలు నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచారపరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల కోలాటం , సంకీర్తనలు అలరించాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.